

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


# దివ్యాంగులకు అండగా విపిఆర్

**నెడు రూరల్ నియోజకవర్గ ఎలక్ట్రిల్ ట్రై సైకిళ్ల పంపిణీ, కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం**

**నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి**

**విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు దాదాపు 850 ట్రై సైకిళ్ల అందజేత**

**హాజరు కానున్న ఎంపీ వేమిరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**




**నెల్లూరు రూరల్, జూన్ 3, ప్రభాతవార్త :** దివ్యాంగులకు అండగా నిలుస్తూ వారి మదిలో సంతోషం నింపుతూ ఒక ఉన్నతాశయంతో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నెల్లూరు రూరల్ నియోజక వర్గానికి చేరుకుంది. ఈ నెల 4న బుధవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనుండగా విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే సభా ప్రాంగణానికి ట్రై సైకిళ్లు చేరుకున్నాయి. ట్రై సైకిళ్ల పంపిణీ అనంతరం నెల్లూరు రూరల్ నియోజకవర్గస్థాయి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరగనుంది. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజకీయాల్లో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఎమ్మెల్యేల సహకారంతో ఇప్పటికే కోవూరు, ఉదయగిరి, కందుకూరు, కావలి నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు, దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ పూర్తి చేయగా ఆత్మకూరులో మంత్రి ఆనంతో ఆత్మీయ సమావేశం, ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ చేపట్టగా ఇప్పటికే ఉదయగిరి, ఆత్మకూరు, కోవూరు, కందుకూరు, కావలి నియోజకవర్గాల్లో ఎంపీ వేమిరెడ్డి ట్రై సైకిళ్లు అందించారు. ఒక్కో ట్రై సైకిల్ విలువ రూ.45 వేలకు పైనే ఉండగా ట్రై సైకిళ్లు అందించడంతో పాటు వాటి నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో దాదాపు 100 మంది దివ్యాంగులను గుర్తించి వారికి ట్రై సైకిళ్లు అందించనున్నారు. ఇప్పటివరకు పూర్తయిన నియోజకవర్గాల్లో దాదాపు 800 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి ట్రై సైకిళ్ల పంపిణీ, ఆత్మీయ సమావేశం ఈ నెల 4న బుధవారం ఉదయం 10:00 గంటలకు నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడులో ఉన్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. సమావేశానికి సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.



# వెట్టిచాకిరి నిర్మూలన పై చర్యలు

## జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ అధికారులను ఆదేశం



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 3, ప్రభాతవార్త :** మంగళవారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వెట్టి చాకిరి కార్మికుల నిర్మూలన కోసం ఏర్పడిన జిల్లా విజిలెన్స్ కమిటీ తొలి సమావేశం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత వెట్టిచాకిరి నిర్మూలన కోసం తీసుకోవాల్సిన చర్యలు, వెట్టిచాకిరి కార్మికులకు కల్పించాల్సిన ఉపాధి, పునరావాసంపై సాంఘిక సంక్షేమ శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు గంటా ప్రియాంక, శ్యామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలో ఇటుకబట్టీలు, పరిశ్రమలు, వ్యాపార దుకాణాలు, రొయ్యలు, చేపల గుంటలు, రైసుమిల్లులు, హోటళ్ల మొదలైన ప్రదేశాల్లో కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు చేసి వెట్టిచాకిరి బాధితులను గుర్తించాలని, వారికి మెరుగైన ఉపాధి, సంక్షేమం అందించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. కనీస వేతనం చెల్లించకపోవడమే కాకుండా శారీరక శ్రమను దోచుకోవడం, ఆర్థిక స్వేచ్ఛను హరించడం, బందీలుగా పనిచేయించడం వెట్టిచాకిరి కిందకు వస్తాయన్నారు. వెట్టి చాకిరి వ్యవస్థలోని కార్మికులను గుర్తించడంలో అధికారులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. వెట్టిచాకిరి బాధితులను గుర్తించడం తదుపరి తీసుకోవలసిన చర్యలు గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. వెట్టి చాకిరి కార్మికులను గుర్తించి వారికి పునరావాసం కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. చట్టప్రకారం సంబంధిత యాజమాన్యాలపై చర్యలుంటాయన్నారు. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి వెట్టిచాకిరి నుంచి బాలలను, కార్మికులను విముక్తి చేసే మంచి కార్యక్రమంలో మానవతాదృక్పథంతో తమవంతు కృషి చేయాలని కోరారు. వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందిన బాలురకు ఒక సర్టిఫికెట్ అందించి పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వాలు తోడ్పాటు అందిస్తాయని, అనేక సంక్షేమ పథకాలు వున్నాయని వివరించారు. త్వరలో జిల్లాస్థాయి అధికారులందరితో వెట్టిచాకిరి నిర్మూలనపై ఒక జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటుచేసి, వెట్టిచాకిరి నిర్మూలనకు అందరూ కృషిచేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జికలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్‌వెల్ఫేర్ డిడి శోభారాణి, కార్మికశాఖ ఉపకమిషనర్ వెంకటేశ్వర్లు, మహిళా పోలీసుస్టేషన్ సిఐ సిహెచ్ కృష్ణారెడ్డి, ఎఎస్ఐ వై.శ్రీహరి, కమిటీ సభ్యులు బషీర్, సుదర్శన్, శ్వేత, సత్యవతమ్మ, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

## - ఇప్పటికే 55 శాతం మందికి పంపిణ్

## - ఇంచార్జ్ కలెక్టర్ కే కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 3, ప్రభాతవార్త** 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ బియ్యం అందించ బడుతుందని ఇంచార్జి కలెక్టర్ . కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధులైన వారు రేషన్ షాప్ వద్దకు రానవసరం లేదని వృద్ధులు, దివ్యాంగుల ఇంటికి డీలర్ వచ్చి 12 గంటల నుండి 4 గంటల లోపు ఇస్తారని తెలిపారు. ముందుగా వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ మేరకు ఫోన్ ద్వారా వారికి సమాచారం అందిస్తున్నామన్నారు. జిల్లాలో 89 వేల మంది వృద్ధులు, దివ్యాంగుల కార్డులు గుర్తించామని, వాటిని మండలాల వారీగా విభజించి డీలర్లకు అందించడం జరిగింద న్నారు. గత 3 రోజులలో ఇప్పటికే సుమారు 50 వేల మందికి వృద్ధుల కార్డులకు బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. డీలర్లు తప్పని సరిగా వారి ఇంటికి వెళ్ళి రేషన్ ఇవ్వాలని, అలా ఇవ్వలేదని ఆరోపణ వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఇంచార్జి కలెక్టర్ కార్తీక్ హెచ్చరించారు.

# సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జూన్ 3, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 428 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 41.680 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 50, ఎన్ఎఫ్‌సికి 300 , పెన్నా డెల్టాకు 2730, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 95.568 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# అమృతపథకంలో వైసిపిపాలనలో భారీస్థాయిలో అవినీతి

## : కావలి ఎమ్మెల్యే





**కావలి, జూన్ 3 ప్రభాతవార్త** కావలి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రవేశపెట్టిన అమృతపథకం పనుల్లో వైసిపి పాలనలో భారీస్థాయిలో అవినీతిచోటుచేసుకుందని, కోట్లాది రూపాయలు దిగమింగారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తనదైనశైలిలో తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణాస్త్రాలు సంధించారు. జూన్ 4వ తేదీకి ఎమ్మెల్యేగా విజయం సాధించి సంవత్సరం అవుతున్న సందర్భంగా మంగళవారం ఆయన వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పురప్రముఖులు, వివిధ వర్గాలవారికి ఏడాదిలో జరిగిన అభివృద్ధి, వైసిపిపాలన 5యేళ్ల కాలంలో జరిగిన విధ్వంసంపై కావలి పట్టణంలోని దొడ్ల మనోహర్‌రెడ్డి, నారాయణ కళ్యాణమండపంలో "పవర్‌పాయింట్ ప్రజంటేషన్" ఇచ్చారు. జర్నలిస్టుల ముసుగులో అమృతపథకం పైలాన్ విధ్వంసం చేశారని దుయ్యబట్టారు. అమృతపథకం పైలాన్ కూల్చబోతున్నారన్న సమాచారం తెలుసుకుని, దానిని కూల్చవద్దని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అప్పటి డిఎస్పీ, కమీషనర్, తహశీల్దార్లకు 2020 ఏప్రిల్ 10వ తేదీన జర్నలిస్టులు వినతిపత్రాన్ని అందచేయడం జరిగిందన్నారు. అదే రోజున ఆనాటి వైసిపి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి జూన్ 12వ తేదీన ప్రెస్‌క్లబ్ ఏర్పాటు శంకుస్థాపన చేస్తానని తెలిపిన వీడియో, 11వ తేదీరాత్రి జరిగిన విధ్వంసం, మందాటి చెరువులో వాటి శిథిలాల వీడియోను ఎమ్మెల్యే దగుమాటి ఈ సందర్భంగా బహిర్గతం చేశారు. పైలాన్ స్థలంలో ప్రెస్‌క్లబ్ వద్దని, జర్నలిస్టులు వాదించినా మాజీ ఎమ్మెల్యే పెడచెవినపెట్టారని, 11వ తేదీ అర్ధరాత్రి పైలాన్‌ను కూల్చివేసి 12వ తేదీ ఆ స్థలంలో శంకుస్థాపనకు రావడం కూడా జరిగిన విషయాన్ని మాజీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు మాజీ ఎఎంసి ఛైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి తెలిపిన వీడియోను ఈ సందర్భంగా ప్రదర్శించారు. పైలాన్‌లో జరిగిన అవినీతి కనబడకుండా ఉండడానికి జర్నలిస్టులను అడ్డుపెట్టుకుని ప్రెస్‌క్లబ్ ఏర్పాటుచేస్తానని వారిని నమ్మించి మోసం చేయడం జరిగిందన్నారు. ఈ కూల్చివేత విషయంలో జర్నలిస్టులు మౌనంగా ఉండడంతో అప్పట్లో వార్తలు వెంటనే రాలేదన్నారు. ప్రభుత్వ ఆస్తి పైలాన్ ధ్వంసమైతే ఆ పైలాన్‌ను ఆఫ్ట్రాల్ అంటూ ప్రతాప్‌రెడ్డి మాట్లాడడం దుర్మార్గమన్నారు. 57.92 కోట్లతో అమృతపథకం టెండర్లను కెఎస్ఎల్ఆర్ కంపెనీ దక్కించుకుందన్నారు. ట్యాంకులు మాత్రమే కట్టారన్నారు. 160 కిలోమీటర్ల పైప్‌లైనుకుగాను 83 కిలోమీటర్ల పైప్‌లైను వేయకుండా 13కోట్లు దోచుకున్నారన్నారు. ఈ డబ్బులు ఎవరిజేబుల్లోకి వెళ్లాయో నిజం బయటకు రావాలన్నారు. పైప్‌లైన్ వేయకుండా త్రాగునీటి కొరత సృష్టించడం ద్వారా గత వైసిపి ప్రభుత్వం 5యేళ్ల నీటి ట్యాంకర్లతో 9.55కోట్లరూపాయల నిధులు వెచ్చించడం జరిగిందన్నారు. పనులు జరగకపోవడంవల్ల అమృతపథకం కింద ప్రజలనుండి వసూళ్లు కావాల్సిన నీటిపన్ను 4.51కోట్లరూపాయలను కోల్పోవలసివచ్చిందన్నారు. దీనివల్ల 27కోట్ల రూపాయల త్రాగునీటిభారం మున్సిపాలిటిపై పడిందన్నారు. అమృతపథకానికి మున్సిపాలిటి 51.92కోట్లు రుణాలు తెచ్చిందన్నారు. అసలు తీర్చకపోగా ఇప్పటికి మున్సిపాలిటి వడ్డీనే చెల్లిస్తుందన్నారు. మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడంతో 15వ ఆర్థికసంఘం నిధులు రాలేదన్నారు. కావలి మున్సిపాలిటి ఎన్నికలు జరిగితే కౌన్సిల్‌కు అన్ని తెలుస్తాయని,ఎన్నికలు జరగకుండా చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రెస్‌క్లబ్ కోసం అమృతపథకం పైలాన్ ధ్వంసం చేసిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి 5యేళ్ల పాలనలో ఎందుకు కట్టించలేకపోయాడని ప్రశ్నించారు. ఇదే అమృతపథకం పైలాన్‌ను నా స్వంత నిధులతో శంకుస్థాపనచేసి నిర్మిస్తానని హర్షధ్వానాల మధ్య ఎమ్మెల్యే దగుమాటి ప్రకటించారు. 94 శాతం అమృతపథకం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారని, కాని పనులను మాత్రం చేయలేదని తెలిపారు. దోషులను శిక్షించేందుకు విజిలెన్స్ కమిటీ వేద్దామా...అంటూ ఆయన ప్రజలను ప్రశ్నించారు. నీటిశుద్ధిప్లాంట్ 84శాతం పూర్తిచేశారని చెబుతున్నా పనులు చేయలేదని ఇక్కడకూడా డబ్బులు దోచేశారని దుయ్యబట్టారు.

**ఉదయగిరి రోడ్డులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ పైప్‌లైన్ ధ్వంసం** ఉదయగిరి రోడ్డులోని జాతీయ రహదారిపై మున్సిపాలిటి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి వచ్చే పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారని, దీని విలువ 7.40కోట్ల రూపాయలు అని ఎమ్మెల్యే దగుమాటి తెలిపారు. ఎలాంటి నష్టపరిహారం జాతీయ రహదారి సంస్థ నుండి రాబట్టకుండా కాంట్రాక్టర్లతో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి కుమ్మక్కు అయ్యారని మండిపడ్డారు. ఈ నిధులను ప్రస్తుతం రికవరి చేయడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఒక్క త్రాగునీటి పథకంలోనే 35 కోట్లరూపాయలు అవినీతి జరిగిందని తెలిపారు.

**చంద్రబాబు ఆశీస్సులతో కావలి నియోజకవర్గం అభివృద్ధి** కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో కావలి నియోజకవర్గం అభివృద్ధిపథంలో దూసుకుపోతుందన్నారు. ఏడాదిపాటు జరిగిన అభివృద్ధిని ఆయన వీడియో ద్వారా చూపించారు. దగదర్తి మండలంలోని కౌరుగుంట నుండి, కావలి రూరల్ మండలంలోని లక్ష్మీపురం వరకు గల రైల్వేగేట్లవద్ద ఆర్ఓబి, ఆర్‌యుబిల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. పలుచోట్ల రైల్వేబ్రిడ్జిలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. 13.48 కోట్లతో కావలి మున్సిపాలిటీలో అభివృద్ధిపనులు జరుగుతున్నాయన్నారు. అలాగే అమృత్ 2.0కు 15.26 కోట్ల రూపాయలు యుఐడిఎఫ్ నిధులతో 22.8 కోట్లతో పనులకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. కావలిలో చిరువ్యాపారాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేందుకు మున్సిపాలిటి ఆధ్వర్యంలో 360 షాపులు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల షాపులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. నూతన కూరగాయల మార్కెట్ ఏర్పాటు, టౌన్‌హాల్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి ఇంటినుండి వందశాతం చెత్తను సేకరిస్తున్నామని, బిన్ ఫ్రీ సిటీగా మారుస్తున్నామన్నారు. దశాబ్దాలుగా మరమ్మత్తులకు నోచుకోని ఉదయగిరి బ్రిడ్జికి మరమ్మత్తులు చేపట్టడం జరిగిందని తెలిపారు. అనేక చోట్ల సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. భాష్యం స్కూల్ నుండి మున్సిపల్ ప్లాట్ల వరకు 27.5 కోట్లరూపాయలతో జాతీయ రహదారిని విస్తరింపచేస్తున్నామన్నారు. ఎన్నోయేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన కావలి-తుమ్మలపెంటరోడ్డు, దగదర్తి-బుచ్చి రోడ్లకు మోక్షం కలిగిస్తూ కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు చేయిస్తున్నామన్నారు. త్వరలో పనులు పూర్తవుతాయన్నారు. కావలి మాజీ ఎమ్మెల్యేగా పనిచేసిన మాగుంట పార్వతమ్మను స్మరించుకుంటూ కావలి ట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మరోడ్డుగా ప్రభుత్వంతో జీ.ఓ జారీచేయించడం జరిగిందన్నారు. 58.82 కోట్లతో ఆర్‌అండ్‌బి ఆధ్వర్యంలో రోడ్లపనులు చేపడుతున్నామన్నారు. రైతులకు సాగునీరు అందించే డిఆర్, డిఎం ఛానల్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మెట్టప్రాంతానికి కూడా 2వ పంటకు సాగునీరు అందించడం జరిగిందని తెలిపారు. 48.48 కోట్లరూపాయలతో పంచాయితీరాజ్ పనులు చేస్తున్నామన్నారు. జలజీవన్ మిషన్‌తో గ్రామాల్లో ప్రతి ఒక్కరికి సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేకశ్రద్ధ చూపిస్తున్నామన్నారు. కొండబిట్రగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 24 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. కావలి ఏరియా వైద్యశాలలో సౌకర్యాల కల్పనకోసం 44 లక్షల రూపాయల ఎంపి నిధులతో పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. రైతుబజార్‌ను పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడానికి 38 లక్షలతో పనులను చేపట్టినట్లు తెలిపారు. కావలి అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని, కావలిని కాపుకాస్తానని ఎమ్మెల్యే దగుమాటి తెలిపారు. అనంతరం అభిమానులు, టిడిపి నేతలు ఎమ్మెల్యేను గజమాలలతో, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అవినీతిపరుడు ప్రతాప్‌రెడ్డిఅని, ఆయన అనుచరుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి కూడా దోచుకున్నారని కావలి ఎమ్మెల్యే దగుమాటి దుయ్యబట్టారు. అయితే, తాను అభివృద్ధే ధ్యేయంగా పెట్టుకుని పనిచేస్తున్నానన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

**- మైపాడు బీచ్‌లో యోగాంధ్ర గ్రాండ్ సక్సెస్ - సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం**

**- యోగాంధ్ర ద్వారా చంద్రబాబునాయుడు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సంకల్పం సాకారం చేద్దాం - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**






**ఇందుకూరుపేట, జూన్ 3, ప్రభాతవార్త** దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు యోగ భాగం చేసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఇందుకూరుపేట మండలం మైపాడు బీచ్ వద్ద ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె ఇన్‌ఛార్జీ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు నందుకొని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం లో 2000 మందికి పైగా పాల్గొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మైపాడు సముద్ర తీరంలో నిర్వహించిన ఈ మెగా ఈవెంట్ లో ఆయుష్, యోగా మిత్ర మండలికి చెందిన యోగా గురువులు వేలాదిగా విచ్చేసి సామూహిక యోగా కార్యక్రమంలో పాల్గొన్న వారిచే యోగాసనాలు వేయించారు. కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జీ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన విధానం యోగాతోనే సాధ్యమన్నా రు. నేటి నుండి ప్రారంభమయ్యే గ్రామ, వార్డు స్థాయిల యోగ శిక్షణలో ప్రజలు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగ మాత్రమే సమాధానమన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న వారికి ధన్యవాదాలు తెలిపారు. వాకింగ్ చేయలేని వారు ఇంట్లోనే ఉంటూ యోగ సాధన ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చని సూచించారు. యోగాంధ్ర ద్వారా చంద్రబాబునా యుడు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సంకల్పం సాకారం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. యోగాంధ్ర లాంటి ఈ వెంట్ల సందర్భాలలో మొక్కుబడిగా కాకుండా ప్రతి నిరంతర యోగ సాధన చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. జిల్లాలో 8లక్షలకు పైగా యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్టర్ కావడం ప్రజలలో ఆరోగ్యం పట్ల పెరుగుతున్న అవగాహనకు నిదర్శమన్నారు. యోగాంధ్ర లాంటి ప్రజా రహిత కార్యక్రమాల గురించి సచివాలయాల పరిధిలో గ్రామ నాయకుల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ అనూష, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, టీడీపీ సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఇందుకూరుపేట, బుచ్చి రూరల్ టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్‌రెడ్డి, బెజవాడ జగదీష్, గుత్తా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నేషనల్ బీచ్ కబడ్డీ రిఫరీగా శ్రీనివాసరావు



**ఉలవపాడు, జూన్ 3, ప్రభాతవార్త :** కరేడు గ్రామానికి చెందిన సాధం శ్రీనివాసరావు జూన్ 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు మంగినపూడి బీచ్, మచిలీపట్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు సాదం శ్రీనివాసరావు ఎంపికైనట్లు రిఫరీగా ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. నాకు ఈ అవకాశం ఇచ్చి ఈ స్థాయికి తీసుకువచ్చిన యలమంచిలి శ్రీకాంత్‌కి ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ రెఫరీస్ బోర్డు చైర్మన్ బి.మురళి కుమార్ పీడీకి, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ రిఫరీస్ బోర్డు కన్వీనర్ పి.రవీంద్రబాబు పీడీకి, మా గురువు ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసి డెంట్ కుర్ర భాస్కరరావుకి, సెక్రటరీ వై.పూర్ణచంద్రరరావుకి సాదం శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



**ఉలవపాడు, జూన్ 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉలవపాడులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం పోస్టర్‌ను ఉలవపాడు మండలం అధ్యక్షులు నన్నం పోతురాజు మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో అధికంగా కుక్కలు కోతులు బెడద ఉందని పంచాయతీ ఈవోకి వినతిపత్రం అందజేత



**ఉదయగిరి, జూన్ 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి గ్రామంలో ఇటీవల వీధి కుక్కలు, కోతలు సంఖ్య గణనీయంగా పెరిగి పోయా యి. వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగు తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీటి వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలపై పెద్దవారిపై దాడులు చేస్తుండడం వల్ల భయంతో పిల్లలు పెద్దలు బయటకు రావడానికి కూడా వెనుకాడుతున్నారు. ఇది గ్రామంలో భద్రతాపురమైన సమస్యగా మారింది. కావున ఈ సమస్యకు గ్రామ పంచాయతీ ఈవో కరిముల్లాకు తెలుగుదేశం నాయకులు షేక్ గాజుల షర్బుద్దిన్ వినతిపత్రం అందజేశారు. ప్రజలు కుక్కల పట్ల కోతుల పట్ల ఇబ్బందులకు గురికాకుండా తక్షణమే పంచాయతీ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారుల సహాయంతో వీటి నియంత్రణ ఏర్పాట్లు తీసుకోవాలని ఆయన కోరారు.

## రాష్ట్ర అభివృద్ధి కనిపించడం లేదా?



**కొడవలూరు, జూన్ 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టడం జరిగిందని తువ్వార ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ఎంపీ వేమిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సారథ్యంలో అభివృద్ధి బాట ముందుకు సాగుతూ ఉంటే కొంతమంది వెన్నుపోటు దినం కార్యక్రమానికి కోవూరు నియోజకవర్గ ప్రజలు హాజరుకావాలని చెప్పడం సరైన విధానం కాదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా ఒకటి తర్వాత ఒకటి హామీలను నెరవేర్చడం జరుగుతుందని, త్వరలోనే తల్లికి వందనం, మహిళలకు ఆగస్టు 15 ఉచిత బస్సు సౌకర్యం ఇలా ఎన్నో కార్యక్రమాలు ప్రజల ముందుకు తీసుకురావడం జరుగుతుంటే వెన్నుపోటు దినం అని కార్యక్రమాలు చేయడం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. కోవూరు నియోజకవర్గం పోతిరెడ్డి పాలెం గ్రామంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ సంబంధించి అప్పులను ఎమ్మెల్యే ముఖ్యమంత్రితో చర్చించి ఆ అప్పులను తీర్చినందుకు వెన్నుపోటు కార్యక్రమమా, ఈరోజు మహిళా ఎమ్మెల్యే మొట్టమొదటిసారిగా కోవూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళుతుంటే ఓర్వలేక పోతున్నారని తెలియజేశారు.

## యువత నాయకత్వం, సాధికారతపై దృష్టి సారించాలి



**ఆత్మకూరు, జూన్3ప్రభాతవార్త:** కిశోర బాలికలు నాయకత్వం, సాధికారతను కలిగి ఉండాలన్నారు. ఏ విషయాన్ని అయినా తామే సాధించుకునే దిశగా ప్రయత్నం చేయాలని ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పి.సునీలత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాత జంగాలపల్లి అంగన్‌వాడీ కే ంద్రంలో కిశోరవికాసం-వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కిశోరబాలికలు అన్ని విషయాలపై అవగాహన పెంచుకొని తమ తల్లిద ండ్రులకు కూడా తా ము తెలుసుకున్న విషయాల గురించి తెలియజేయాలన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు తాము భయపడి వెనుకడుగు వేయకుండా ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.లక్ష్మీనరసమ్మ, ఎస్.కవిత,జి.కామేశ్వరి, ఎంఎస్‌కె, కిశోరబాలికలు, మహిళలు పాల్గొన్నారు.



## ఘనంగా సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

– తెలుగు యువత,టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్ – అంబరాన్ని అంటిన సంబరాలు



**పొదలకూరు, జూన్ 3, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి. పొదలకూరు పంచాయితీ బస్టాండులో మంగళవారం సాయంత్రం టిడిపి తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడులతో పాటు టిడిపి యూత్ నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తెలుగు యువత మండల అధ్యక్షుడు వెన్నపూస రాజారెడ్డి బ్రహ్మదేవి చంద్రా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సర్వేపల్లిలో తెలుగుదేశం పార్టీని ముందుండి నడిపించాలని కోరారు. ప్రజాక్షేత్రంలో సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరెన్నో పదవులు పొంది రాజకీయాల్లో తమకంటూ ఓ గుర్తింపు స్థానాన్ని పొందారన్నారు. తండ్రికి తగ్గ తనయుడుగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం తిరుపతి పార్లమెంటు టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్ మాట్లాడుతూ సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని యూత్ నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నిరంతరం సమస్యల కోసం పోరాడుతూ తండ్రికి తగ్గ తనయుడిగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందారన్నారు. పొదలకూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని త్వరలో డిగ్రీ కళాశాల నెలకొల్పనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం తెలుగు యువత ఉపాధ్యక్షులు ఆదాల మురళీ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ టిడిపి అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు, బోగోలు భాస్కర్ రెడ్డి, ఆకులూరు విజయ్ కుమార్, అమర్తలూరు చెంచయ్య, అక్కెం సుధాకర్ రెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు, కలిచేటి ప్రభాకర్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ వెంపులూరు అరుణ, తెలుగు యువత నాయకులు ఆదాల మురళి, గుదే రామకృష్ణ నాయుడు, కొమ్మి చిరంజీవి, మండల ఉపాధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, బ్రహ్మదేవి చంద్ర, కందే సురేష్, చమికల వెంకటేశ్వర్లు, గంటా మల్లికార్జున్ యాదవ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చెంచయ్య, గుర్రం మధు, ప్రభాకర్, మీరా, మధు, అమర్థలూరు రాజా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యున్నతికి కృషి ఆదాని కృష్ణపట్నం పోర్ట్

### - సీఈవో జగదీష్ పటేల్ వెల్లడి



**ముత్తుకూరు, మే 3, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా మండలి పదవ తరగతి, పన్నెండో తరగతి 2025 బోర్డు పరీక్షలలో 90 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు సాధించినందుకు అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్, కృష్ణపట్నం ముత్తుకూరు జెడ్‌పిపి వరగలిలోని జెడ్‌పిపి హై స్కూల్‌తో పాటు ముత్తుకూరులోని అదానీ విద్యా మందిర్‌లకు చెందిన 38 మంది విద్యార్థులను మంగళవారం ఆదాని కృష్ణపట్నం పోర్టులో సత్కరించారు. ఈ సందర్భంగా ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జగదీష్ పటేల్ మాట్లాడుతూఅదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ తన సిఎస్ఆర్ విభాగం అదానీ ఫౌండేషన్ ద్వారా పోర్టు పరిసర ప్రాంతాల అభివృద్ధి నిబద్ధతను నెరవేరుస్తుందని అలాగే అదాని ఫౌండేషన్ ద్వారా పోర్టు పరిసర ప్రాంతాలకు గ్రామాల్లో విద్యా అభివృద్ధిపై కృషి చేస్తుందని తెలిపారు. ఈ ఏడాది బోర్డు పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులందరినీ చూసి ఎంతో గర్విస్తున్నామన్నారు. ఎకెపిఎల్ పరిధిలోని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల విద్యా నైపుణ్యం కోసం అదానీ ఫౌండేషన్ అదానీ పోర్ట్ మరింత సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ తన విభాగం అదానీ ఫౌండేషన్ ద్వారా సాయంత్రం కోచింగ్ తరగతులను నిర్వహించి, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ప్రాజెక్ట్ ఉత్థాన్ ద్వారా వారికి స్టడీ మెటీరియల్‌లను అందించిందని, దీని ఫలితంగా వారు పదో తరగతి, పన్నెండో తరగతి బోర్డు పరీక్షలలో అధిక మార్కుల శాతం సాధించగలిగారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పంచాయతీ నాయకులు గ్రామ ప్రతినిధులు, అదానీ పోర్ట్ అదానీ ఫౌండేషన్ అధికారులు తోపాటు ముత్తుకూరులోని జడ్పిపి హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ శ్రీనివాసులు కృష్ణపట్నంలోని జడ్పిపి హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి. సరళ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

**కలువాయి జూన్ 3 ప్రభాతవార్త :** మండలంలోని వెరిబొట్ల పల్లి గ్రామ పరిసరాలలో పేకాట నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు కలువాయి ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు మంగళవారం గ్రామ పరిసరాలలో పేకాట నిర్వహిస్తున్న 8 మందిని అదుపులోకి తీసు కోగా వారి వద్ద నుండి 70 వేలా 180 రూపాయాలు స్వాధీన పరచుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సాగుచేయాలి




**కలిగిరి, జూన్ 3, ప్రభాతవార్త :** రైతులు రసాయన ఎరువుల శాతాన్ని 25శాతం తగ్గించి జీవన ఎరువులు వాడుకోవాలని భారతీయ వరి పరిశోదనా స్థానంమృత్తికశాస్త్ర విబాగం ప్రదాన శాస్త్ర వేత్త డాక్టర్ డి.వి.కె .నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం కలిగిరి మండలంలోని కొత్తూరు గ్రామంలో వికశిత్‌కృషి సంకల్ప అబియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఆచార్య యంజి రంగా వ్యవసాయ విశ్వవిధ్యాలయం , కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరి వారి ఆద్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో రైతుల నుద్దేశించి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆదారంగానే రైతులు తమ పొలాల్లో ఎరువులు ఉపయోగి ంచుకోవాలన్నారు.అదేవిదంగా రైతులు పచ్చిరొట్టవిత్తనాలను తప్పక సాగుచేయాల్సి ఉంటుంద న్నారు.అదేవిదంగా మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు మాట్లాడుతూ రైతులు ఈసీజన్లో అధికంగా నువ్వుల సాగుచేపట్టారన్నారు. నువ్వుల సాగులో రైతాగం పాటించవలసినమెలుకువలు గురించి ఏఓ రైతులకు తెలియ జేశారు.కృషి విజ్ఞాన కేంద్రంశాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు జీవన ఎరువులు వాడుకొనిరసాయన ఎరువుల మోతాదు తగించాలని రైతులకు సూచించారు..సమగ్ర పోషక యాజ మాన్యంలో బాగంగా సూక్ష్మ పోషకాలు ప్రాముక్యతన వివరిస్తూ రసాయన ఎరువుల వాడకం వల్ల జరిగే అనర్దాలను తెలియ జేశారు. ఈకార్యక్రమంలో విఎఎ. వెంకటేశ్వర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి దాతల సహకారం అమోఘం




**వలేటివారిపాలెం జూన్ 3 ప్రభాతవార్త** మండలంలోని కుగ్రామైన కాకర్లపాలెం మే నెలాఖరున నిర్వహించిన శ్రీరామలువారి దేవాలయ పునర్నిర్మాణానికి పలువురు దాతలు స్వచ్ఛందంగా పాల్గొన్నా రు.ఆరికంగా,హార్దికంగా తమ దాతృత్వాన్ని చాటుకొని కార్యక్రమ విజయానికి దోహదం చేశారు.ప్రతిష్ఠాత్మకమైన ధ్వజస్థంబాన్ని ఉండేల రమణారెడ్డి,శ్రీనివాసరెడ్డి దంపతులును సమకూర్చారు.అదేవిదంగా ఉత్సవ విగ్రహాలను గోదా మాల్యాద్రి అరుణ దంపతులు,గోదా నరసింహారెడ్డి జ్యోత్స్ను లు ఉత్సవవిగ్రహాలకు మకరతోరణం,దేవతామూర్తుల విగ్రహాలుతోపాటు ఫీఠం,సూత్రాలను చౌడబోయిన చినగంగయ్య ,సుబ్బాయమ్మ వెంకటేశ్వర్లు శ్రీలక్ష్మిలు,గర్భగుడి తలుపులను చౌడబోయిన చిన నరసిసంహం లావణ్య దంపతలు,గర్భగుడి రాతి దర్వాజాను ఉండేల రామిరెడ్డి,సుబ్బరత్తమ్మలు,ఆలయంచుట్టూ గ్రిల్స్‌ను ముతకని పోతులూరయ్య దంపతులు (అమెరికా), ప్రహరిగోడను పెయ్యల మల్లికార్జునరావు పావని దంపతులు,ప్రహరిగోడ గేట్స్‌ను పెయ్యల మాదవరావు,అనూరాధ దంపతులు, గోదా ఆదినారాయణరెడ్డి ప్రశాంతిలు లైటింగు సౌకర్యాన్ని,దాసరి నాగరాజు అనూషాలు టైల్స్‌ను,నల్లబోతుల మాలకొండయ్య ఆదిలక్ష్మిలు దేవతా విగ్రహాలకు కిరీటాలు,తోరణం,పోతినేని వెంకటేశ్వర్లులక్షమ్మలు ఆంజనేయస్వామి విగ్రహంను సమకూర్చారు.మూడు రోజులపాటు ఈ కార్యక్రమానికి హాజరైన భక్తులుకు రెడ్లు,యాదవలు,నాయకులు,రజకులు సామూహికంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.ఇంకా అనేక మంది దాతలు వారికి తోచిన రీతిలో ఈ బృహతా ర్యానికి సహకరించినట్లు నిర్వహకులు తెలిపారు. వీరందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## వెన్నపోటు కార్యక్రమంపై కరపత్రం విడుదల



**వలేటివారిపాలెం జూన్ 3 ప్రభాతవార్త** 4వ తేదీన కందుకూరులో వైసీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యక్రమా లకు నిరసనగా వెన్నుపోటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహ న్‌రెడ్డి ఆదేశాల మేరకు కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి వివిధ హోదాల్లో ఉన్న వైసీపీశ్రేణులు అభిమానులు బారీగా తరలి రావాలని మండల వైసీపీ అధ్యక్షుడు అనుమోలు లక్ష్మినరసింహం తెలిపారు. ఈ మేరకు మంగళవారం వలేటివారిపాలెంలో కరపత్రం విడుదల చేశారు.నేతలు ఇరపని అంజయ్య, వలేటి మాల్యారి, నలమోతు చంద్రమౌళి, కట్టా హను మంతరావు,పరిటాల శింగయ్య,ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర,బచ్చు శ్రీను,పొట్టేళ్ల కిష్టయ్య, అంజయ్య తదితరులు ఉన్నారు.

## చుండిలో యోగా నిర్వహణ



వలేటివారిపాలెం జూన్ 3 ప్రభాతవార్త యోగా పాటించడం వలన శారీరక మానసిక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని స్థానిక ఎంపీడీవో కె.నరేంద్రదేవ్ అన్నారు. మంగళవారం ఆయన చుండిలో నిర్వహిస్తున్న యోగా శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నిర్వహణ వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. అన్నివయస్సులు వారికి యోగా ఎంతోదాహదం చేస్తుందన్నారు. ఇందులో బాగంగానే రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్, సిబ్బంది సుప్రజతోపాటు పలువురు పాల్గొన్నారు.

## మెథడ్స్ డియస్సీ కోచింగ్ సెంటర్ నందు డియస్సీమోడల్ పరీక్షలు

**కావలిరూరల్, జూన్03 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 16347 ఉపాధ్యాయ పోస్టులకు ఈ నెల 6వ తేదీ నుంచి డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటి (డియస్సీ) ద్వారా భర్తీ చేయడానికి పరీక్షలు నిర్వహించబోతున్నందున ఈ నేపథ్యంలో నెల్లూరుజిల్లాలో డియస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు మోడల్ పరీక్షలు ఉచితంగా నిర్వహించడానికి కావలిలోని మెథడ్స్ డియస్సీ కోచింగ్ సెంటర్ ఒక ప్రణాళిక రూపొందించిందని కోచింగ్ సెంటర్ డైరక్టర్ ఐ.శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 9 గంటలకు స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్), స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్), ఈ నెల 7వ తేదీ ఉదయం 9 గంటలకు ఎస్జీటీ (తెలుగు), స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు), స్కూల్ అసిస్టెంట్ (బయాలాజికల్ సైన్స్), స్కూల్ అసిస్టెంట్ (సోషల్) పరీక్షలు నిర్వహించబడునని తెలియచేశారు. పై పరీక్షలన్నీ కూడా ఉచితంగా నిర్వహించబడునని తెలిపారు. పరీక్ష వ్రాసే విద్యార్థులు ముందుగా ఇన్స్‌ట్యూట్‌కు వచ్చి పేరు నమోదుచేసుకోవాలని కోరారు.

## డయేరియాపై ఆశా కార్యకర్తల సమావేశం




**ఉదయగిరి, జూన్ 3, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గండిపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశాడే కార్యక్రమాన్ని వ్యాక్సిన్ ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించడమైంది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎం.శివ కల్పన, డాక్టర్ ఎన్.వినీత అధ్యక్షతన నిర్వహించారు. ఆశా కార్యకర్తలకు ఇచ్చినటువంటి ఈ యాప్ నిర్వహణ గురించి, డయేరియా మేనేజ్‌మెంట్ గురించి ఆశా కార్యకర్తలకు రివోరియంటేషన్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ప్రతి ఆశా కార్యకర్త వారికి కేటాయించిన గ్రామాలలో గర్భవతులకు, చిన్నారులకు, బాలింతలకు, వ్యాధిగ్రస్తులకు అందించు సేవల సర్వేలలో పాల్గొని వారికి సేవలు అందించాలని తెలియజేశారు. ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలియజేశారు. డయేరియా నివారణ చర్యల గురించి, మలేరియా నివారణ చర్యల గురించి అసంక్రమణ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. అర్హులైన దంపతులను తరచూ సందర్శించి వారి యొక్క ఆరోగ్య స్థితిగతులను ఈ యాప్ నందు నమోదు చేయాలని తెలియజేశారు. చిన్నారులకు టీకాలు ఇప్పించడంలో, 104 ఆరోగ్య సేవలలో, ఆశా కార్యకర్తలు గ్రామంలోని ప్రజలకు అవగామన కల్పించాలని తెలియజేశారు. మలేరియా మాసోత్సవాలలో భాగంగా అవగాహన ర్యాలీ సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు నిర్వహించడమైంది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య, సీహెచ్ఓ సీహెచ్ శివకుమారి పర్యవేక్షకులు అంకమ్మ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వోల కొరతతో ప్రజల ఇక్కట్లు

**దగదర్తి, జూన్ 3, ప్రభాతవార్త :** దగదర్తి మండల ప్రాంతంలో వీఆర్వోల కొరత వల్ల దగదర్తి మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దగదర్తి మండలంలో వీఆర్వోలు తక్కువ ఉండటంతో ఒక్కొక్కళ్ళు రెండు మూడు గ్రామాలు చూసుకోవాల్సి వస్తుంది. రీ సర్వేలకి వివిధ భూమి రికార్డులు పరిశీలించడం ఇతర ధృవీకరణ పత్రాల కోసం వీఆర్వోలు అవసరం కావడంతో వారు అందుబాటులో లేక గ్రామ ప్రజలు వీఆర్వో ఎక్కడ ఉన్నాడు వెతకవలసిన పరిస్థితి వస్తుంది. వీఆర్వో లేకపోతే ఆఫీసులో ఇన్‌ఛార్జీ ఉన్నాడని చెప్తున్నారంట ఆ ఇన్‌ఛార్జీలు నాకు సంబంధం లేదని పోయిన ప్రజలని ఇబ్బందులు పెడుతున్నారు. మండల ఆఫీసులు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. మండలంలో మొత్తం 22 రెవెన్యూ గ్రామాలు ఉండగా వీఆర్వోలు మాత్రం ఎనిమిది మంది ఉండగా ఒక్కొక్కళ్ళకు మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించడంతో ఏ ఒక్క గ్రామానికి న్యాయం చేయలేకపోతున్నారు. అంతే కాకుండా ఏదో ఒక సమావేశాలకు రేషన్ షాపుల నిత్యవసర సరుకులు కోసం అటు ఇటు తిరగడంతో పనులకు అంతరాయం కలుగుతుంది. ఇది గమనించి ఉన్నతాదికారులు వీఆర్వోల కొరతను సమన్వయం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## సనాతన ధర్మాన్ని అపహ్యాసం చేయడాన్ని తీవ్రంగా ఖండించిన బీజేపీ



**నెల్లూరు, జూన్ 3, ప్రభాతవార్త-వైద్యం :** సనాతన ధర్మంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. మూడు పెళ్లిళ్లు చేసుకోవడం సనాతన ధర్మమా..? అనే ప్రశ్న ద్వారా నారాయణ ఏపీ డిప్యూ టీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని వివాదంలోకి లాగడమేకాక, హిందూ సనాతన ధర్మాన్ని అపహాస్యం చేస్తూ చేసిన వ్యాఖ్యలు, ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు కేవలం పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా విమర్శించడానికే కాకుండా, హిందూ ధర్మాన్ని తప్పుగా చిత్రీకరించే కుట్రలో భాగమని ఆయన విమర్శించారు. సనాతన ధర్మం అనేది వ్యక్తిగత జీవిత ఎంపికల కంటే, ధర్మం, న్యాయం, సత్యం, అహింస, శాంతి వంటి సార్వత్రిక మౌలిక విలువలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే ఆధ్యాత్మిక పద్ధతి అని ఆయన పేర్కొన్నారు. మూడు పెళ్లిళ్లు అనే అంశం పూర్తిగా వ్యక్తిగత విషయం అని, దానికి సనాతన ధర్మాన్ని ముడిపెట్టడం అసంబద్ధమని స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితాన్ని ఆధారంగా తీసుకుని ఒక ప్రాచీన ధర్మాన్ని విమర్శించడం చాలా బాధాకరమని అభిప్రాయపడ్డారు. సనాతన ధర్మం అనేది వేల సంవత్సరాలుగా భారతీయ సమాజానికి మార్గదర్శకంగా నిలిచిన ఆధ్యాత్మిక వ్యవస్థగా చరిత్రలో నిలిచిందని గుర్తు చేశారు. మహిళల గౌరవానికి పెద్దపీట వేసే ఈ ధర్మాన్ని విమర్శించడం కేవలం రాజకీయ లాభాల కోసమేనని చిలకా ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.

## విశాఖపట్నంలో జరుపబోయే యోగా దినోత్సవ సామూహిక సమావేశాన్ని రద్దు చేయాలి

**బిట్రగుంట, జూన్ 3 ప్రభాతవార్త :** విశాఖపట్నంలో 21 వ తేదీన జరగనున్న భారీ యోగా దినోత్సవ కార్యక్రమంను తాత్కాలికంగా కోవిడ్ దృష్ట్యా రద్దు చేయాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేకల వెంకట రమణయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం తో సహా దేశవ్యాప్తంగాకోవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య ఆందోళనకరంగా పెరుగుతున్న సందర్భంగా షుమారు 2 లక్షల మంది పాల్గొనే అవకాశం ఉన్న ఈ కార్యక్రమం కోవిడ్-19 సూపర్ స్ప్రెడర్ ఈ వెంట్ గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు నేటికి, భారతదేశంలో 3, 961 యాక్టివ్ కోవిడ్-19 కేసులు ఉన్నాయి. గత 24 గంటల్లో 685 కొత్త కేసులు మరియు 4 మరణాలు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కేరళలో ఇప్పటికే నమోదైన యాక్టివ్ కేసులు 1435, మహారాష్ట్రలో 506, ఢిల్లీలో 483, గుజరాత్ లో 265, కర్ణాటకలో 234, పశ్చిమ బెంగాల్ లో 331 ఆంధ్రప్రదేశ్ లో 17 మరియు తెలంగాణలో 3 నమోదయినాయి. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటికే రెండు రోజుల్లోనే నాలుగు కేసులు రిపోర్ట్ అయినాయి, విశాఖపట్నంలో 3 రాయలసీమ నుంచి ఒకటి నమోదయ్యాయి, విశాఖపట్నంలోనే ఒక మరణం సంభవించడం పరిస్థితి యొక్క తీవ్రతను నొక్కి చెబుతోందని, జాతీయంగా ఇప్పటివరకు 32 కోవిడ్-19 సంబంధిత మరణాలు నమోదయ్యాయి. ఇంత ఆందోళనకరమైన గణాంకాలు ఉన్నప్పటికీ, ఈ సామూహిక సమావేశాన్ని కొనసాగించాలనే ప్రభుత్వం నిర్ణయం సరికాదన్నారు.. లక్షలాది మంది మరణాలకు దారితీసిన కోవిడ్-19 రెండవ దశ నుండి మనకు గతంలో చేదు అనుభవం ఉంది, అప్పటి సామూహిక సమావేశాలు కోవిడ్ విపత్కర వ్యాప్తికి దారి తీశాయి. మన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ముంచెత్తి అపారమైన బాధలను కలిగించాయి. ఈ ఆందోళనలకు తోడు, ఆంధ్రప్రదేశ్ సమాచార మరియు ప్రజా సంబంధాల మంత్రి పార్ధ సారధి ఇటీవల ఒక ప్రకటనలో కోవిడ్ పట్ల నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరిస్తూ. కోవిడ్-19 వ్యాప్తిని నివారించడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెద్ద సమావేశాలను నివారించాలని మరియు రద్దీగా ఉండే ప్రాంతాల్లో మాస్కులను తప్పనిసరి చేయాలని ఆయన పేర్కొనడం జరిగిందన్నారు. ఈ సందర్భంలో అలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల ముఖ్యంగా ప్రధానమంత్రి హాజరు అయ్యే అవకాశం ఉన్నందున ఈ విషాదం పునరావృతం అయ్యే ప్రమాదం ఉంది. ప్రజారోగ్య వనరులు సరిపోయినంతగా లేకపోవడం వల్ల వైద్య ఆరోగ్య సిబ్బంది ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. వైద్య సిబ్బందిని ఈ కార్యక్రమానికి కేటాయించారు. దీనివల్ల కేసులు పెరిగే అవకాశం వుంది, కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే లక్షణాలతో ఉన్న పిల్లలను పాఠశాలలకు పంపవద్దని సూచించింది. ఇది జాగ్రత్త అవసరాన్ని తెలియజేస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మరియు యోగా దినోత్సవ వేడుకలో సామూహికసమావేశ భాగాన్ని రద్దు చేయాలని, వర్చువల్ లేదా చిన్న తరహా కార్యక్రమం నిర్వహిస్తే ప్రజారోగ్యానికి హాని కలిగించకుండా. యోగానుప్రోత్సా హం కలిగించవచ్చని సూచించారు.

## చామదలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్

**జలదంకి, జూన్ 3 ప్రభాతవార్త :** జలదంకి మండలం చామదలలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఆచార్య ఎన్ జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషివిజ్ఞానకేంద్రం నెల్లూరు వారి ఆధ్వర్యంలో జరిగిన అభియాన్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.ఖరీఫ్ సీజన్‌లో అనువైన పంటలు వారి సాగువిదానంఎరువుల వాడకం తదితరాలపై వివరించారు.డాక్టర్ ఎన్ లోకేష్‌బాబు ప్రస్తుతం ప్రభుత్వ పదకాలగూర్చి సవివరంగ తెలియజేశాడు.అలాగే కృషి విజ్ఞానకేంద్రం రైతులు,యువత సంక్షేమంకోసం చేస్తున్న కార్యకలాపాలగూర్చి తెలియజేశారు.ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి శివన్నారాయణ వ్యవసాయ పరంగ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పదకాలను గూర్చి తెలిపాడు.అలాగే భూసార పరీక్షల ఫలితాల కనుగు ణంగ ఎరువుల వాడకం చేపట్టాలని చెప్పారు.ద్రవరూప జీవన ఎరువులవాడుకోవాలని సూసించారు.నెల్లూరు సీనియర్ శాస్త్రవేత్త సిహెచ్ లక్ష్మి ఎడగారు,రబీసీజన్‌లో వేసుకొనే రకాలగూర్చి తెలియజేశారు.జలదంకి వ్యవసాయాదికారిణి శైలజ రైతాంగం ఫార్మర్‌ఐడి వాటి ప్రాముఖ్యత గూర్చి వివరించారు.రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.జిల్లావనరుల కేంద్రం వ్యవసాయాదికారిణి శైలజ కుమారి మాట్లాడుతు రైతులు ఖచ్చితంగ భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.ఈకార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు,

## ఘనంగా సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ముత్తుకూరు, జూన్ 3, ప్రభాతవార్త :** సర్వేపల్లి టిడిపి సమయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ మాజీ మంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కుమారుడు సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ కార్యకర్తలు అందరూ జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసం సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని తండ్రి బాటలో తనయుడు కూడా నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఎన్నో పదవులు రాజగోపాల్ రెడ్డి ఆకాంక్షించాలని ఆ భగవంతుని కోరుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈదురు రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ నన్నం దీనయ్య, మైనార్టీ నాయకులు ఆలిముత్తు, పట్టణ అధ్యక్షుడు బులిగర్ల శ్రీనివాసులు, ముసునూరు వారి పాలెం సాగుటి సంఘ అధ్యక్షులు ముసునూరు రామ్మోహన్ రెడ్డి, నర్సా రెడ్డి నాగార్జున శంకర్, కొత్తపల్లి రమేష్ శర్మ, విష్ణువర్ధన్, రామ శోభన్, ఫైనపురం సర్పంచ్ విజయ్ వావిల వెంకటరమణయ్య, నీలం రాంబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో ఒత్తిడి దూరం



**కోవూరు, జూన్ 3 ప్రభాతవార్త :** రోజూ ప్రాణాయామం ధ్యానం చేయడం వలన ఒత్తిడి దూరమవుతుందని యోగా శిక్షకులు తెలిపారు. యోగాంధ్ర-2025లోభాగంగా కోవూరు మండలంలోని అన్ని సచివాలయల్లో యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేయడం వలన శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని వెల్లడించారు. యోగా సాధనతో మానసిక ఒత్తిడి నుంచి బయట పడవచ్చని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఉద్యోగంలో పని ఒత్తిడి అధిగమించి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలంటే యోగా మంచి మార్గమని సూచించారు. యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆయా సచివాలయ ఉద్యోగులు, వార్డు సభ్యులు ఉన్నారు.

## వ్యాధి నిరోధక టీకాల పట్ల అవగాహన అవసరం





**కోవూరు, జూన్ 3 ప్రభాతవార్త :** కోవూరు , విడవలూరు మండలాలకు సంబంధించిన పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఈ ప్రాంతాల్లో పశు పోషకులు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలను వేయించి వ్యాధులు ధరి చేరకుండా తగు చొరవ తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న ఏడీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పశువులకు ఈ సీజన్‌లో గొంతు వాపు వ్యాధి రాకుండా హెచ్‌ఎస్ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని , అదేవిధంగా జబ్బ వాపు వ్యాధి రాకుండా బీక్యూ వ్యాక్సిన్ కూడా ప్రస్తుతం తెల్ల పశువులకు వేయడం జరుగుతుందని, జూన్ 10వ తేది వరకు ఈ వ్యాక్సినేషన్ వేసే కార్యక్రమం రెండు మండలాల్లో కొనసాగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాంతాల్లోని పాడి రైతులు పశు సహాయకులకు సహకారం అందించాలన్నారు. ప్రస్తుతం సురభి చాయాన్ సంకల పథకానికి సంబంధించియాప్‌లో మేలుజాతి అధిక పాలు ఇచ్చే (15 నుంచి 20 లీటర్లు) పాడి పశువులను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతుందని, కోవూరు మండలానికి 50 పశువులు, విడవలూరు మండలానికి 50 పశువులు లక్ష్యంగా ఇవ్వడం జరిగిందన్నారు. మేలుజాతి రకం పాడి పశువులను అభివృద్ధి చేయాలన్నదే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు.

## సర్వేలు వేగవంతం అయ్యేలా చొరవ తీసుకోవాలి



**కోవూరు, జూన్ 3 ప్రభాతవార్త :** మండలంలోని అన్ని ప్రాంతాల్లో సర్వే కార్యక్రమాలు మరింత వేగవంతం అయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన ఈ విషయమై ఈవోపీఆర్డీ శ్రీనివాసులుతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పంచాయతీల విభజన, ఆదాయం జనాభా ఆధారంగా జరుగుతుందని, దీనికి సంబంధించి పూర్తి నివేదికను తయారు చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం ఇచ్చిన సర్వేలను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తయ్యేలా తగు చొరవ తీసుకోవాలన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్ 3 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారిని నాగవల్లి పత్రాలతో ప్రత్యేకంగా పూజించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకిషోర్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## బికె నగర్ పేకాట స్థావరంపై పోలీసుల దాడులు ముగ్గురు వ్యక్తులు అరెస్ట్... 1800 నగదు స్వాధీనం

**కావలి, జూన్ 3 ప్రభాతవార్త :** కావలి మున్సిపాలిటీ పరిధిలోని బికె నగర్ పొలాల్లో పేకాట స్థావరంపై కావలి రూరల్ ఎస్ఐ తిరుమలరెడ్డి సిబ్బందితో ఆకస్మిక దాడులు మంగళవారం నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద ఉన్న 1800 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు మాట్లాడారు. ఎక్కడైనా గ్రామాలలో పేకాట, కోడిపందేలు ఆడుతున్నట్లు, గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియచేయాలని ఆయన కోరారు.

## మెగా కంటి పొర చికిత్స శిబిరం

**వింజమూరు, జూన్ 3, ప్రభాతవార్త :** వింజమూరులో వైఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 6వ తేదీ నుండి 13వ తేదీ వరకు శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పొర చికిత్స శిబిరం నిర్వహించబడుతుందని నిర్వాహకులు వై.రాఘురామిరెడ్డి, ఎం.తిరుపాల్‌రెడ్డి, పి.వెంగయ్యలు తెలిపారు. సిగు వెంకటేశ్వర్లు ధనలక్ష్మీ దంపతుల జ్ఞాపకార్థం షేగు సుబ్బారావు నిర్మలాదేవిలు ఆధ్వర్యంలో ఉచిత కంటి పొర చికిత్స శిబిరం నిర్వహిస్తారన్నారు. వింజమూరు పరిసర గ్రామాల ప్రజలు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. కంటి శుక్లం ఉన్న వారికి మాత్రమే కంటిపొర ఆపరేషన్ చేయబడుతుందని వారు తెలిపారు. ఈనెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు కంటి ఆపరేషన్లు నిర్వహించబడతాయని అన్నారు. ఆపరేషన్‌కు వచ్చిన వారికి లెన్స్, కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తారని ఇతర వ్యాధులు ఉన్నవారు గతంలో వాడే మందులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఆపరేషన్ జరిగిన రెండు గంటలలోపుగా ఇంటికి వెళ్ళవచ్చని తెలిపారు. ఆపరేషన్లకు వచ్చేవారు ఫోన్ నెంబరు ఆధార్ కార్డును తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. షేగు సతీష్ కుమార్, నాగ శశికళ ఆదిత్య విక్రంల ఆధ్వర్యంలో ఈశిబిరం నిర్వహించబడుతుందని వారు తెలిపారు.

## ఉదయగిరి ఆర్టీసీ డిపో ఎదుట కార్మికుల ఆందోళన



**ఉదయగిరి, జూన్ 3, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం తెల్లవారు జామున నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఆధ్వర్య ంలో నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఐదు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేస్తామ న్నారు. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరాహార దీక్షకు దిగుతామని అన్నారు. తమ సమస్యలు వెంటనే పరిష్క రించాలని తెల్లవారుజామున యూనియన్ నాయకులు అంద రూ కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్ఎంయు నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాన్ని సందర్శించిన తహసిల్దార్ సోమ్లా నాయక్



**ఆత్మకూరు,జూన్3ప్రభాతవార్త:** మే నెల 1వ తేదీన ఆత్మకూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించిన సందర్భంలో ప్రభుత్వం రూపొందించిన బంగారు కుటుంబం అనే పథకం ద్వారా ఆత్మకూరు మండలంలోని చెర్లో యడవల్లి గ్రామానికిచెందిన జ్ఞానమ్మ అనే గిరిజన కుటుంబాన్ని ఎంపిక చేశారు. ఆ కుటుంబాన్ని మంగళవారం మండల తహసిల్దార్ సోమ్లా నాయక్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్న మార్గదర్శి సాహో ఫౌండేషన్ నిర్వాహకుడు నాగేశ్వరరావ్ జ్ఞానమ్మ కుటుంబం అభివృద్ధికి మేకలు మేపుకునేందుకు లక్ష రూపాయలు నగదును అందించారు. ఆ మేకలను అందించేందుకు కార్యక్రమంలో పాల్గొన్న తహసిల్దార్ వారి ఇంటి నిర్మాణానికి కేటాయించిన ఇంటి స్థలాన్ని , మేకల దొడ్డి నిర్మాణానికి కావలసిన స్థలాన్ని తహసిల్దార్ పరిశీలించారు. ఈ విషయాన్ని ఆర్‌డిఒ బి.పావనితో చర్చించి వారి సూచనలతో అనువైన స్థలాన్ని కేటాయిస్తామని తహసిల్దార్ సోమ్లా నాయక్ తెలిపారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది , గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్ధిక స్థిరత్వాన్ని పొందాలి




**వింజమూరు, జూన్ 3, ప్రభాతవార్త :** స్వయం ఉపాధితో జీవనోపాధిని పెంపొందించుకోవాలి ఆర్థిక స్థిరత్వాన్ని పొందాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం భారత సంకల్పం కృషి అభియాన్ పథకం ద్వారా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘ సభ్యులు, వ్యవసాయ శాఖ సచివాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ శాస్త్రవేత్త డాక్టర్ సుజాతరెడ్డి మాట్లాడుతూ మహిళలు చిరుధాన్యాలతో అనేక విధాలుగా తయారు చేసుకుని ఉపాధిని పొందే అవకాశం ఉందన్నారు. కొందరు అవకాశం లేక శక్తి ఉన్న చేసుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. మహిళలు ఆరోగ్య రక్షణ పిల్లల సంరక్షణ తదితర అంశాలను ఎలా చేయాలన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. గృహపరిశ్రమలుగా కూరగాయాల పెంపకం బిస్కెట్ల తయారీ కొవ్వొత్తుల తయారీ తదితర అంశాలను తీసుకుని అందుకు సంబంధించిన యూనిట్లను ఏర్పాటు చేసుకున్నట్లయితే కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ఏదైనా అవసరమైన సలహాలు సూచనలు అందజేస్తామన్నారు. అదే విధంగా వెరైటీ ఆల్బమ్ తో పాటు ఆన్‌లైన్ డిజిటల్ మార్కెట్‌కు అనుసంధానం చేసుకోవాలన్నారు. ఏదైనా ఒక బ్రాండ్ ఏర్పాటు చేసుకొని చిరుధాన్యాలతో తయారయ్యే అనేక రకాలైనటువంటి తినుబండారాలను తయారు చేస్తూ మార్కెటింగ్‌కు అవకాశం కల్పించుకుని తద్వారా అదనపు ఆదాయాన్ని పొందాలన్నారు. కోళ్ల పెంపకాల ద్వారా అనుకున్న ఆదాయాన్ని పొందవచ్చని అన్నారు. అంతే కాకుండా ప్రస్తుతం అరటి నారా తీసే యంత్రం అందుబాటులో ఉందని కావాల్సిన వారు గ్రూపులుగా ఏర్పడి తీసుకున్నట్లయితే తయారు చేసుకోవచ్చన్నారు. మహిళలు ఎక్కువగా విలువ ఆధారిత ఉత్పత్తులను చేయాలని తెలిపారు. రాగులు, మొక్కజొన్నలు ఆకుకూరలతో రకరకాల పదార్థాలను ఉత్పత్తి చేయవచ్చన్నారు. గిట్టుబాటు ధరలు లేని యెడల విలువ ఆధారిత పంటలను పండించుకోవాలని తెలిపారు. గ్రామంలోని మహిళలు కొత్త కొత్త ప్రాజెక్టులు చేస్తున్నారని, కానీ వారు బయటకు రావడం లేదన్నారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శివ జ్యోతి మాట్లాడుతూ రైతులు, గ్రామస్తులు కలిసి ఒక నూతన వస్తువులను ఉత్పత్తి చేసేందుకు గ్రూపులుగా ఏర్పడి తయారు చేసుకోవచ్చని తెలిపారు. తద్వారా తమ జీవనోపాధిని పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. మిద్దె తోటలు పెంపకంతో ఆరోగ్యం ఆదాయం రావడమే కాకుండా స్వచ్ఛమైన పంట వస్తుందన్నారు. మిద్దెతోటలకు రసాయనిక ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులతో అనగా వానపాముల ఎరువు కంపోస్టు విలువలను ఉపయోగించి కూరగాయాలను పండించవచ్చన్నారు. ఎవరైనా గ్రూపు సభ్యులు ఏదైనా యూనిట్ స్థాపించుకోవాలనుకుంటే ఒక లీడర్ ద్వారా ముందుగా విషయాన్ని తెలియజేసి అందరు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వినీత ఏడీఏ పి.చంద్రభాను, ఏవో శ్రీహరి నారాయణ, ఏఈఓ శిల్ప కళ, స్వయం సహాయక సభ్యులు, సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు, రైతులు తదితరులు హాజరయ్యారు.

## దేవాలయాలలో చోరీ

**జలదంకి, జూన్ 3 ప్రభాతవార్త :** జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో సోమవారం రాత్రి నాలుగు దేవాలయాలలో చోరి జరిగింది.రాత్రివేళ వరుసగ ఒకేసారి ఇన్ని దేవాలయాలో చోరీకి పాల్పడడం గ్రామంలో కలకలం రేపింది.రోజుమాదిరే రాత్రిళ్ళు పూజల అనంతరం అర్చకులు తాళాలువేసి వెళ్ళిపోయారు.తెల్లవారి ఎదాప్రకారం ఆలయాలకు వచ్చిన పూజారులు తలుపులు తెరిచివుండడం చూసి అవాక్కయ్యారు.లోపలికి వెళ్ళిచూడగ హుండీలు పగులగొట్టి వుండడాన్ని గుర్తించారు.దీంతో వారు విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదుచేశారు.కలిగిరి సిఐవెంకటనారాయణ,ఎస్ఐ లతీవున్నీష సిబ్బంది హుటాహుటిన గ్రామానికి వెళ్ళి పరిశీలించారు. సాయిబాబ, బ్రహ్మంగారి దేవాలయాలలోహుండి పగుల గొట్టిన విదానాన్ని పరికించారు.అలాగే శివాలయం పోలేరమ్మ దేవాలయాలలో తలుపులు తెరిచివుండడం జరిగిందిగాని ఎలాంటి చోరి జరగలేదని గుర్తించారు.క్లూస్‌టీమ్ కూడ వచ్చి తనిఖీలు చేసింది. కేసున మోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ లతీవున్నీష తెలియజేశారు.

## జూన్4 వెన్నుపోటు దినంగా పాటిద్దాం

**ఉదయగిరి, జూన్ 3, ప్రభాతవార్త :** జగనన్న పిలుపు మేరకు మన నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణంలోని వైఎస్సార్ బొమ్మ వద్ద నుండి బస్టాండ్ కూడలి వరకు ఉదయగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జూన్4న బుధవారం ఉదయం 10గంటలకు జరిగే నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుంది. కావున ఈ కార్యక్రమానికి ఉదయగిరి మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల సభ్యులు, కూటమి ప్రభుత్వం వల్ల మోసపోయిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ప్రజల తరుపున పోరాడుదాం ప్రల గొంతుకై ప్రతిధ్వనిద్దాం అంటూ ఉదయగిరి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి అన్నారు.

## రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిపనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**కావలి, జూన్ 3 ప్రభాతవార్త** కావలి పట్టణం ముసునూరు రాఘ వేంద్రకాలనీలో నూతనంగా ఏర్పా టుచేసిన రైల్వే అండర్‌పాస్‌బ్రిడ్జి పనులను కావలి ఎమ్మెల్యే మంగళ వారంపరిశీలించారు. మొదటిలైన్‌పై పట్టాలను తొలగించి బాక్స్‌బ్రిడ్జి ఏ ర్పాటుకు అధికారులు పనులు ప్రా రంభించారు. బ్రిడ్జిపనులను త్వరి తగతిన పూర్తిచేసి ప్రజల ఇబ్బం దులు తొలగించాలని రైల్వే అధికారులను కావలి ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైల్వేఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బుచ్చి సచివాలయం -1లో యోగాసనాలు



**బుచ్చి జూన్ 3 ప్రభాతవార్త** బుచ్చి రెడ్డిపాళెం సచివాలయం -1లో సచి వాలయం అధికారులు, నాయకు లుయోగాసనాలు వేశారు. అంతర్జా తీయ యోగ దినోత్సవం పురస్కరిం చుకొని యోగసనాలు వేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత కార్మిక డైరక్టర్ తాళ్ళ నరసింహస్వామి, హా స్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరామి రెడ్డి మాట్లాడుతు మన ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఆదేశానుసారం, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచనల మేరకు సచివాలయంలో యోగాసనాలు వేయడం జరిగిందని అన్నారు. యోగాతో పరిపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. ప్రతి రోజు ప్రతి ఒక్కరు నిత్యం ఉదయాన్నే యోగాకి కొంత సమయం కేటాయిం చాలని అన్నారు. తద్వారా ప్రతి ఒక్కరు యోగా చేస్తే అందరు సంపూర్ణమైన ఆరోగ్యవంతులౌతారని అన్నారు. యోగాలో నిపుణులైన వారి వద్ద నుండి ఆసనాలు ఏలా వేయాలో తెలుసుకొని ఆసనాలు వేయా లని వారు సూచించారు. కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## పెరుగుతున్న ప్రేగు సంబంధిత వ్యాధులు

### - మెడికవర్‌లో అత్యాధునిక వైద్య చికిత్సలు



**నెల్లూరు, జూన్ 3, ప్రభాతవార్త -వైద్యం** మన జీర్ణ వ్యవస్థలో ప్రేగులు(చిన్న ప్రేగు, పెద్ద ప్రేగు) ఆహారాన్ని జీర్ణం చేయడంలో, పోషకాలను శరీ రానికి అందించడంలో వ్యర్థాలను బయటకు పం పడంలో కీలక పాత్ర పోషిస్తాయని అలాంటి ప్రేగులను ఆరోగ్యంగా ఉంచుకుంటేనే జీవన గమ నం సజావుగా ముందుకు సాగుతుందని నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌గా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ కే. శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాలంలో ప్రేగు సంబంధిత సమస్యలతో అనేక మంది హాస్పిటల్‌కు వస్తున్న తరుణంలో ప్రేగు వ్యాధులు రావడానికి గల కారణాలు, వాటి లక్షణాలు, చికిత్సలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ప్రత్యేకంగా మీడియాతో మాట్లాడారు. ప్రేగు సంబంధిత సమ స్యలు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని, రోజు వారి జీవితం కూడా సజావుగా సాగదని అన్నారు. ప్రేగు సంబంధిత వ్యాధులకు నెల్లూరు మెడికవర్ హాస్పిటల్‌లో అధునాతన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, అనుభవజ్ఞులైన వైద్య బృందం కూడా ఉందని తెలియజేశారు. సాధారణంగా ప్రేగు సంబంధిత సమస్యలు ఏడు రకాలుగా ఉంటాయని డాక్టర్ కే. శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్ అని పిలిచే ప్రేగు సంబంధ సమస్యకు పొత్తి కడుపులో నొప్పి, తిమ్మిర్లు, ఉబ్బరం, విరేచ నాలు, మలబద్ధకం లాంటి లక్షణాలను కలిగి ఉంటుందని చెప్పారు. అధిక ఒత్తిడి, కొన్ని ఆహార పదార్థాలు తీసుకోవడం, పేగులోని సూక్ష్మజీవులలో అసమతుల్యత కారణంగా ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్ సమస్య వస్తుందన్నారు. ఆహార నియంత్రణ, జీవన శైలిలో మార్పులు చేసుకోవడం, ఒత్తిడి లేకుండా జీవించడం, లక్షణాలను బట్టి మదులు వాడితే ఈ సమస్య నుండి బయటపడవచ్చునని పేర్కొన్నారు. ప్రేగు సమస్యల్లో మలబద్ధకం కూడా ఒకటని, తక్కువ ఫైబర్ ఆహారం తీసుకోవడం, తక్కువ నీరు తాగడం, శారీరక శ్రమ లేకపోవడంతో మలబద్ధక సమస్యవ స్తుందని వైద్యులు తెలిపారు. ఫైబర్ అధికంగా ఉంటే ఆహారం తీసుకోవడం, పుష్కలంగా నీరు తాగడం, వ్యాయామం చేయడం, సమస్యను బట్టి మందులు వాడితే మల బద్ధకం సమస్య నుండి బయటపడవచ్చునని డాక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలియజేశారు. తరచుగా నీళ్ల విరేచనాలు అవ్వడం కూడా ప్రేగు సంబంధిత సమస్యల్లో భాగమన్నారు. బ్యాక్టీరియా, వైరస్ ఇన్ ఫెక్షన్, ఆహార అలెరీ లు, జీర్ణాశయాంతర వ్యాధుల కారణంగా నీళ్ల విరేచనాలు అవుతాయని, ద్రవ రూపంలో ఆహారం తీసుకుంటూ యాంటీ బయాటిక్స్ ఇతర మందులు వాడితే నీళ్ల విరేచనాలు తగ్గుతాయన్నారు. ఇన్‌ఫ్లేమేటరీ బవెల్ డిసీజ్ ఇది కూడా ప్రేగు వ్యాధుల్లో పెద్ద సమస్యకు దారి తీస్తుందని కొన్ని సందర్భాల్లో ఈ సమస్యకు శస్త్ర చికిత్స కూడా చేయాల్సి ఉంటుందని డాక్టర్ శ్రీధర్ రెడ్డి హెచ్చరించారు. ఈ వ్యాధి కారణంగా ప్రేగులు వాపునకు గురౌతాయని, అలాగే క్రోన్ స్ వ్యాధి కూడా ప్రమాదకరమైందని ఇది జీర్ణ వ్యవస్థలో ఏ భాగానైనా ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. అల్సరేటివ్ కొలైటిస్ అనే మరో సమస్య మూలంగా పెద్దప్రేగు, పురీషనాళం ప్రభావితమవుతాయని పేర్కొన్నారు. రోగ నిరోధక వ్యవస్థలో లోపాలు, జన్యు పరమైన అంశాలు, పర్యావరణ కారకాల కారణంగా ఈ సమస్యలు వస్తాయన్నారు. తీవ్రమైన కడుపు నొప్పి, రక్తంతో కూడిన విరేచనాలు, బరువు తగ్గడం, అలసట లాంటి లక్షణాలను ఈ వ్యాధులకు లక్ష ణాలుగా చెప్పుకోవచ్చునని వెల్లడించారు. వాపును తగ్గించే మందులు వాడటం, జీవనశైలిలో మార్పుల ద్వారా ఈ సమస్యల నుండి బయటపడవచ్చునని కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని డాక్టర్ శ్రీధర్‌రెడ్డి తెలియజేశారు. డైవర్టికులైటిస్ అనే సమస్య ద్వారా పెద్దప్రేగు గోడలలో బుడగలు ఏర్పడ తాయని, ఒక్కో సారి ప్రేగు వాపునకు కూడా గురౌతుందన్నారు. కొలన్ క్యాన్సర్ అనే సమస్య జఠిలమని, ఇది సోకితే పెద్ద ప్రేగు, పురీషనాళంలో క్యాన్సర్ కణాలు పెరుగుతాయని చెప్పారు. ఈ సమస్యకు శస్త్ర చికిత్స, కిమోథెరపీ, రేడియేషన్ థెరపీ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ప్రేగు సంబంధిత సమస్యలను నిర్ధారించడానికి వైద్యులు లక్షణాలను బట్టిపరీక్షలు నిర్వహిస్తారని రక్తపరీక్షలు, మలపరీక్షలు, కొలనో స్కోపీ, ఎండోస్కోపీ,సీటీ స్కాన్ లేదా ఎంఆర్ఐ వంటి పరీక్షలు చేయాల్సి ఉంటుందన్నారు. నెల్లూరు మెడి కవర్ హాస్పిటల్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం ప్రేగు సంబంధిత సమస్యలతో బాధపడేవారికి సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు నిర్దిష్టమైన చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నా యని, అనుభ వజ్ఞులైన వైద్య బృందం ప్రేగు సమస్యలు రాకుండా జీవనశైలి సలహాలను అందిస్తుందని చెప్పారు. మెడిక వర్‌లో అత్యాధునిక వైద్య సౌకర్యాలు,పరికరాలు అందుబాటులో ఉన్నాయని,రోగిని సం పూర్ణ ఆరోగ్యవం తునిగా మార్చడానికి తాను కట్టుబడి ఉన్నామని గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ కే. శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రతి రోజూ నివేదికలు పంపాలి



**కోవూరు, జూన్ 3 ప్రభా తవార్త :** గృహ ని ర్మాణాలు మరింత వేగ వంతం అ య్యేందుకు ఇంజనీ రింగ్ అసిస్టె ట్లు చొరవ తీసు కోక పోతే వారిపై శాఖా పరమైన చర్యలు తీసు కోవ డం జరుగు తుం దని ఎం పీడీవో శ్రీహ రిరెడ్డి హెచ్చ రించారు. స్థానిక ఎంపీ డీవో కార్యాలయంలోమంగళవారం మండలంలోని అన్ని సచివాలయాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసి స్టెంట్లు , వర్క్ ఇన్‌స్పెక్టర్లు గృహ నిర్మాణ శాఖ డీఈ వెంకటేశ్వర్లురెడ్డితో కలిసి ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ, బీసీలకుగృహ నిర్మాణాలకు నిధులు పెంచిన నేపథ్యంలో దీనికి సంబంధించి మొత్తం మండలంలో 490 గృహాలు ఉన్నాయని, ఈ గృహాలన్నీ నిర్మా ణాలు వేగవంతం చేయడమే కాకుండా 88 గృహాలు ఆర్‌సీ దశలో ఉన్నాయని, వీటన్నిం టినీ జూన్ 12వ తేదీ లోగా నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఇంజ నీరింగ్ అసిస్టెంట్ వారి వారి పరిధిలో ప్రతి రోజూ లబ్దిదారులతో చర్చించి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చొరవ తీసుకోవడమే కాకుండా ప్రతిరోజూ నివేది కలను ఆన్‌లైన్‌లో పంపేలా చూడా లన్నారు. వీటి పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా సచివాలయాల వారీగా నిర్మాణాల పనితీరుపై సమీక్షించారు.

## నేడు వెన్నుపోటు దినం



**కోవూరు, జూన్ 3 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గానికి మండల కేంద్ర మైన కోవూరు పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి , వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వ ర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు బజార్ సెంటర్‌లో ప్రారంభం అయ్యే ఈ నిరసన ర్యాలీకి నియోజకవర్గ పరిధిలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, వాలంటీర్లు, ఎండీయూ వాహనాల డ్రైవర్లు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఈ నిరసన కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు నరసింహులురెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కార్యాలయంలో వా రు మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు బజార్ సెంటర్‌లో ఈ నిరసన ర్యాలీ ప్రారంభం అయి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వరకు కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజ యవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

## బినామీ పేర్లతో పొదుపులో 4.5 లక్షలు గిరిజనులకు టోకరా

### న్యాయం చేయండి అంటు గిరిజనుల ఆవేదన



**మనుబోలు జూన్ 3 ప్రభాతవార్త** పొదుపుగ్రూ ప్‌లో బినామీ పేర్లతో రుణం తీసుకొని తమను చెల్లించమని అధికారులు వేదిస్తున్నారని తమకు న్యాయం చేయాలని కోరుతు గిరిజనులు ఆందోళన కుదిగారు. మనుబోలు మండల కేంద్రంలోని తూ ర్పు గిరిజన కాలనీకి చెందిన పదిమంది గిరిజనులు శ్రీలక్ష్మీ పొదుపు గ్రూపుగా ఏర్పడి పొదుపు ద్వారా బ్యాంకు లింకేజితో 15 లక్షల రుణం పొందారు. ఆరుణమును ఒక్కొక్కరు ఒకటిన్నార లక్ష చొప్పున పంచుకున్నారు. ఈ నగదును అసలు వడ్డీ నెలనెల చెల్లిస్తువస్తున్నారు. గతంలో పనిచేసిన వివోఏ బినామీ పేర్లతో తమ సంతకాలను పోర్జరీ చేసి తమకు తెలి యకుండా శ్రీనిధి ద్వారా బాలమ్మ, పత్రా రమణమ్మ, సింగంపాటి అంకమ్మలు ఒక్కొక్కరి పేర్లతో యాభైవేలు వంతున ఒక లక్ష యాభైవేలు అలాగే సంఘ బంధం నుండి తమ గ్రూప్ పేరుతో ఒక లక్ష యాభైవేలు అలాగే సంఘం బందం నుండి తమగ్రూప్ పేరుతో ఒక లక్షరూపాయాలు ఉన్నతి ద్వారా మరో లక్ష స్పెషల్ రుణం కింద ఒక లక్ష తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. గ్రూప్ సభ్యులకు తెలియకుండా మొత్తం నాలుగు న్నార లక్షలు తీసుకున్నారని ఇప్పుడు అధికారులు చెప్పేవరకు తమకు తెలియదని అన్నారు. తమ గ్రూప్‌లో తమకు తెలియకుండా రుణం ఎలా ఇస్తారని వారు అధికారులను ప్రశ్నించారు. తాము తీసుకున్న రుణంకు నెలనెల వడ్డీ అసలుతో సహా 11 వ నెల వరకు చెల్లించామని ఆనగదు తమ రుణంకు జమ కాలేదన్నారు. ఇంకా 3,80,000 అసలుతో పాటు వడ్డీ చెల్లించామని అధికారులు బత్తిడి చేస్తున్నారని పొదుపు లీడర్లు పత్రా సుబ్బమ్మ, అంకమ్మలు తెలిపారు. చదువురాని వాళ్లం కావడంతోఆ సమయంలో ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది చేతి వాటం చేపి సంతకాలు పోర్జరీ చేసి మోసం చేశారని వారు వాపోయారు. ఇప్పుడు తమ గ్రూ పుని చెల్లించమంటే అంత నగదు ఎక్కడ నుండి తేవాలి అని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఈవి షయమై అనేక సార్లు ఐకెపి కార్యాలయం చుట్టు తిరుగుతున్నా తమకు న్యాయం చేయకపోతే వెలుగు కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## విన్నూత తరహాలో సంతకాలు సేకరించిన సంగం సిఐ,ఎస్ఐ



**సంగం జూన్ 3 ప్రభాతవార్త** సంగం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సంగం సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్, వాహనదారుల చేత సంతకాలు సేకరించారు. పోలీస్ జీపుకు ఫ్లెక్స్ కట్టి వాహన దారులు రోడ్డు నియమనిబంధనలు ఉల్లంఘించమని, పద్దతి ప్రకారమే వాహనాలు నడుపుతామని సంతకాలు చేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఆటో వాలాలు అధిక జనాభాను ఎక్కించుకొకుండా వెళతామని, కార్లలలో వేళ్లేవారు సీటు బెల్ట్ పెట్టుకొని వెళతామని వాహన దారుల చేత సంతకాలు తీయించుకున్నారు. ఈ సందర్భంగా సిఐ వేమారెడ్డి మాట్లాడుతు వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు వాళ్ళ కుటుంబాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి శృతి ,మించిన స్పీడుతో వెళ్ళి వారితోపాటు మరొకర్ని కూడా బలి చేస్తున్నారని ఇది మంచి విధానం కాదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించాలని క్షేమంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి ఆనం వెంకటరెడ్డి

### - వెంకటరెడ్డి విగ్రహ ఏర్పాటులను పరిశీలించిన వీబీఆర్



**నెల్లూరు, జూన్ 3, ప్రభాతవార్త-వైద్యం** రోడ్డు విస్తరణలో భాగంగా గతంలో తొలగించిన దివంగత నేత ఆనం వెంకురెడ్డి విగ్రహ పున:ఆవిష్కరణ ఏర్పాట్లను వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ముత్తుకూరు గేట్ సెంటర్లో తెలుగుదేశం పార్టీ నెల్లూరు నగర అధ్యక్షుడు మామిడాల మధు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమారుడు శుభకర్‌రెడ్డి స్థానిక ముఖ్య నాయకులు, కార్పొరేటర్లతో విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించి ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 8న ఆదివారం విగ్రహ పున:ప్రతిష్ఠకు పనులు వేగవంతం చేయాలని కోరారు. నెల్లూరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నేత ఆనం వెంకటరెడ్డి విగ్రహ పున:ప్రతిష్ఠకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. గతంలో తొలగించిన విగ్రహాన్ని సింహపురి సేవాసమితి ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాకాణి తీర్పు 5వ తేదీకి వాయిదా



**నెల్లూరు క్రైమ్ జూన్ 3 ప్రభాతవార్త :** క్వార్జ్ కుంభకోణం కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పోలీస్ కస్టడీ పిటిషన్‌పై ఇరుపక్షాల వాద నలు ముగిశాయి. కస్టడీ పిటిషన్, అ లాగే బెయిల్ పిటిషన్‌పై ఈనెల 5న న్యాయస్థానం తీర్పు వెలువరించ నుంది. కాకాణిని కస్టడీలోకి తీసు కుంటే కేసులో పూర్తి వివరాలు తెలు స్తాయని డీఎస్పీ ఘట్టమనేని శ్రీని వాస్ తెలిపారు. కేసులో ముద్దాయిలు ఇచ్చిన సమాచారం మేరకు కాకాణిని కస్టడీకి తీసుకుంటే లోతైన సమాచారం సేకరించవచ్చన్నారు. కోర్టులో ఇరుపక్షాల వాదనలు న్యాయమూర్తి విన్నారని, పోలీస్ కస్టడీకి ఇస్తారన్న నమ్మకం ఉందని డీఎస్పీ శ్రీనివాస్ చెప్పారు.

## నవోదయ ప్రవేశ పరిక్షకు దరఖాస్తు చేసుకోండి

**మర్రిపాడు, జూన్3ప్రభాతవార్త:** మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి లోచేరేందుకు జులై 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ పి.శ్రీనివాసరావ్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు తల్లిదండ్రులు కాని, గార్డియన్‌తో కలిసి 5వ తరగతి చదువుతున్న విద్యా లయ ప్రధానోపాధ్యాయులతో పూర్తిచేయబడిన దరఖాస్తు ఫారంపై సంతకం చేసి సీల్‌చేయించాలి, అభ్యర్థి పోటో, తల్లికాని తండ్రికాని , అభ్యర్థి సంతకం చేసిన దరఖాస్తును ఏదైనా ఇంటర్‌నెట్ సెంటర్‌లో హెచ్‌టి టిపిఎస్ నవోదయ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని ఆయన తెలిపారు. పరిక్ష డిసెంబర్ 13న జరుగుతుందని ఆయన తెలిపారు. కావున అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సఫాయి కర్మచారీల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత

### - జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె కార్తీక్ అధికారులకు సూచన



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 3, ప్రభాతవార్త:** మంగళవారం ఉద యం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమా వేశ మందిరంలో మా న్యువల్ స్కావెంజర్స్ యాక్ట్‌పై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించా రు. సమావేశం ఉద్దేశం, కమిటీ దృష్టికొచ్చిన అంశాలను సోషల్ వెల్ఫేర్ డిడి శోభారాణి వివరించారు. తొలుత నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కర్మచారీల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను మున్సిపల్ ఈఈ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నెల్లూరు నగరంలో 90 మంది సఫాయి కర్మచారీలు పనిచేస్తున్నారని, వీరి ద్వారా ఎక్కడా కూడా చేతులతో మలమూత్రాలు, ఇతర అపరిశుభ్ర వ్యర్థాలను తొలగించకుండా చర్యలు చేపట్టామన్నారు. సెప్టిక్‌ట్యాంకర్లతోనే తొలగిస్తున్నామని చెప్పారు. సఫాయి కర్మచారీల ఆరోగ్య భద్రత కోసం రిఫ్లెక్టింగ్ జాకెట్లు, సేఫ్టీ హెల్మెట్లు, ఫేస్ మాస్క్, హ్యాండ్ గ్లౌజ్‌లు, బూట్లు, రక్షణ దుస్తులు మొద్కలెన పిపిఈ కిట్లను అం దించి సురక్షితంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వీరికి రుణాలు మంజూరు చేసి సెప్టిక్ ట్యాం కర్లు, చెత్తతొలగించే వాహనాలు అందించి ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయితే సెప్టిక్ ట్యాంక్‌లు లేకుండా నేరుగా కనెక్షన్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అను సంధానించవచ్చన్నారు. ఈ పనులు త్వరగా పూర్తి చేసి రూపాయికే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు ఇవ్వాలని పురపాలకశాఖ మంత్రి నారాయణ ఆదేశాలిచ్చారని, ఆ మేరకు త్వరలోనే పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కమిటీసభ్యులు జి. చిన్నారావు, కె. పెంచలయ్య, సిహెచ్. లావణ్య, ఎ. మురళీ సఫాయి కర్మచారీల సమస్యలను ప్రస్తావించారు. సఫాయి కర్మచారీలకు క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు నిర్వహిం చాలని, మెరుగైన వైద్యం అందించాలని, ఈఎస్ఐ కార్డులు అందించాలని, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి వారి వాహనాలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు అన్ని అందేలా చూడాలని, కార్పొరేట్ పాఠశాలల్లో సఫాయి కర్మచారీల పిల్లలకు రాయితీలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె. కార్తీక్ మాట్లాడుతూ సఫాయి కర్మచారీల సంక్షేమానికి అన్నిశాఖల అధికారులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సఫాయి కర్మచారీల్లో అర్హులైన వారిని గుర్తించి ఇళ్లు మం జూరు చేయాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకొకసారి మెడికల్ క్యాంపులు తప్పనిసరిగా నిర్వహించి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి వీరికి అన్ని పెండింగ్ బిల్లులు చెల్లించి, ప్రతినెలా కూడా క్రమం తప్పకుండా బిల్లులు అందించాలని ఆదేశించారు. సఫాయి కర్మచారీలకు గుర్తింపుకార్డులు, ఈఎస్ఐ హెల్త్ కార్డులు అందించాలన్నారు. ఒక మెగా క్యాంపును ఏర్పాటు చేసి సఫాయి కర్మచారులకు ఇళ్లు, వైద్యసేవలు, ఆరోగ్యకార్డులు అందించి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అన్ని సచివాలయాల్లో కూడా సెప్టిక్ ట్యాంకులను మున్సిపాలిటీల్లో సఫాయి కర్మ చారీల సెప్టిక్ ట్యాంకు వాహనాల ద్వారా తక్కువ ధరకు తొలగించే అవకాశం వుందని, దీనిపై ముమ్మర ప్రచారం చేయాలని, సెప్టిక్ ట్యాంకుల కోసం టోల్ ఫ్రీ నెంబరు 14420 నెంబరును డిస్‌ప్లే చేయాలని సూ చించారు. ప్రస్తుతం యోగాంధ్ర కార్యక్ర మాలు జరుగుతున్నందున సఫాయి కర్మచారీలను భాగస్వామ్యులు చేస్తూ ఒక యోగాంధ్ర కార్యక్రమాన్ని కూడా నిర్వహించాలని, తాను కూడా హాజరవుతానని చెప్పారు. అనంతరం సఫారీ కర్మచారీలు తమ సమ స్యలను ఇంచార్జ్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, పంచా యతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈలు అశోక్‌కుమార్, వెంకటరమణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చైతన్య, మహిళా పోలీసు స్టేషన్ సిఐ సిహెచ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయండి

### - జిల్లా కలెక్టర్ కె. కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 3, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర జనాభా నిర్వహణ విధానం పై ప్రజాభిప్రాయం సేకరిస్తున్నందున, ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కె. కార్తీక్ ఒక ప్రకటన లో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర జనాభా నిర్వహణ విధానాన్ని అభివృద్ధి చేస్తూ చురుకైన చర్యలను ప్రారంభిం చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ జనాభా నిర్వహణ పై వర్కింగ్ పేపర్ తయా రు చేయబడిందని, దీనిలో భాగంగా ఈ నెల 1 నుండి 20 వరకు వివిధ వర్గాల నుండి ప్రజా సంప్రదింపుల ద్వారా వారి ఆలోచనలు, సూచనలను సేకరించాలని సంకల్పించిందన్నారు. ఇందుకుగాను క్యూ ఆర్ కోడ్ టెక్నాలజీతో కూడిన మొబైల్ అప్లికేషన్ ద్వారా సులభంగా అభిప్రాయాలు తెలియజేయ వచ్చునన్నారు. అదేవిధంగా జిల్లాలోని ప్రతి గ్రామ, వార్డులలో గ్రామ, వార్డు సభలను నిర్వహించడం ద్వారా ఎక్కువ మంది ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తుందన్నారు. ఈ సమావేశాలను పర్యవేక్షించడానికి ప్రతి మండలానికి, మున్సిపాలిటీకి ఒక సీనియర్ అధికారిని నియమిస్తా మని తెలిపారు. జిల్లా స్థాయిలో గ్రామ, వార్డు సభలను నిర్వహించడానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, గ్రామ, వార్డు సచివాలయాల విభాగాలు బాధ్యత వహిస్తాయన్నారు. క్రింద తెలియపరచిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించి ప్రభుత్వ విధానాల్లో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఆహ్వానించిన ఎమ్మెల్యే



**వింజమూరు, జూన్ 3, ప్రభాతవార్త** మెట్ట ప్రాంత ఆరాధ్యదైవం శ్రీనర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్స వాలు ఈనెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు అంగరం గ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పుర ష్కరించుకుని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఉద యగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, నర్రవాడ మాజీ సర్పంచ్ మల్లంపాటి గురవయ్యానాయుడు కలిసి బ్రహ్మోత్స వాలకు ఆహ్వానం పలికారు. ముందుగా పుష్పగుచ్ఛం అంద జేసి వెంకయ్యనాయుడుకి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రెండు గంటల పాటు సుదీర్ఘంగాదేశ, రాష్ట్రాల రాజకీయాలు, ఉదయ గిరి అభివృద్ధిపై ఎమ్మెల్యేకు వెంకయ్య నాయుడు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఉదయగిరి అభివృద్ధికి ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తానని ఎప్పుడు ఎలాంటి అవసరం ఉన్న నాకు తెలియజేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు తెలియజేశారు. ఉదయగిరి ప్రాంతం పాతతరం నాయకుల పేర్లతో సహా తెలియజేసి వారందరిని అడిగినట్లు తెలియజేశారు. అందరిని కలుపుకొని పోతూ ఉదయగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు.

## నారా లోకేష్‌బాబుని కలిసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



**నెల్లూరు, జూన్ 3, ప్రభాతవార్త-వైద్యం** తెలుగు దేశంపార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌బాబును అమరావతిలో మర్యాద పూ ర్వకంగాకలిశాను. ఈ సందర్భంగా యువగళం అనుభవాలతో కూడిన దివాయిస్ ఆఫ్ పీపుల్ పుస్తకం అందజేశారు. రాష్ట్రం నరకకూపంగా మారి నరోజుల్లో లోకేష్‌బాబు చేసిన యువగళం పాద యాత్ర ఆయన రాజకీయ జీవితంలోనే కాదు.. రాష్ట్ర రాజకీయ చరిత్రలోనూ ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. సుదీర్ఘకాలం పాటు రాజకీయం చేస్తే వచ్చే అనుభవం లోకేష్‌బాబుకి ఒక్క యువ గళంతో సాధ్యమైంది. దేవుడి ఆశీస్సులు, ప్రజల దీవెనలతో ఆయనకు మంచి భవిష్యత్తు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

## హ్యాపీడెంట్ యాడ్‌పై ప్రశంసలు

**నెల్లూరు, జూన్ 3, ప్రభాతవార్త-విద్య :** ప్రముఖ చూయింగ్ సంస్థ హ్యాపీడెంట్ తాజాగా విడుదల చేసిన ప్రచారచిత్రం దేశ పజల మన్ననలను, ప్రశంలను అందుకోవటం జరిగిందని పెర్ఫెట్టీవాన్ ఇండియా ఎండీ నిఖిల్‌శర్మ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చమ్‌కా, మస్కాన్, జగమగ్ జహాన్ శీర్షికతో విడుదలై ఈ యాడ్ మిక్కిలి ప్రశంశలు అందుకోవటం జరుగుతుందన్నారు. కాంతులు చిమ్మే చిరునవ్వులతో మహిమను తెలియజేసే విధంగా కధనాన్ని రక్తికట్టించటం జరిగిందన్నారు. ఈ యాడ్ ఫిలిమ్‌ను బాలీవుడ్‌లో ప్రఖ్యాత గాంచిన శంను మైయిత్రా స్వరపరిచారని తెలిపారు. సంస్కృతి, సాంప్రదాయాలను , మనోబావాలను ప్రతిబింబించే బ్రాండ్లను నిర్మించటంలో ప్రభావ వంతమైన వ్యాపారాన్ని కూడా అందించటమే తమ లక్ష్యమన్నారు. అందరూ తమను ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్‌గుంజన్, సీఈఓ జోషిలు పాల్గొన్నారు.